## నవ సమాజానికి

# నిర్మాతలు గురువులే

### పూర్వ విద్యార్థుల సభలో ప్రముఖ పల్మనాలజిస్ట్ డా.వరికూటి సుబ్బారావు



**వనం నాగయ్య, కెరటం న్యూస్**

నవ సమాజ నిర్మాణంలో గురువులే కీలక సూత్రదారులనీ, దేశానికి ఉత్తమ పౌరసమాజాన్ని అందించే గురుతర బాధ్యత ఒక్క గురువులపైనే ఉందని ప్రముఖ పల్మనాలజిస్టు, ఖమ్మంలోని మోర్తాల వెంకటరెడ్డి కాంప్లెక్స్‌లోని శ్రీ లక్ష్మీ మాధవ చెస్ట్, న్యూరో, జనరల్ హాస్పిటల్ వైద్యులు డా.వరికూటి సుబ్బారావు అన్నారు. మధిరలోని తెళ్ల వసంతయ్య స్మారక ప్రభుత్వోన్నత పాఠశాలలో 45వ వార్షికోత్సవ సమ్మేళనం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జడ్పీచైర్మన్ లింగాల కమల్‌రాజు, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మధిర శాసనసభ్యులు మల్లు భట్టివిక్రమార్క సతీమణి మల్లు నందిని తదితరులు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డా.వరికూటి సుబ్బారావు మాట్లాడుతూ.. గురు బ్రహ్మ, గురు విష్ణు, గురుదేవో మహేశ్వర: గురుసాక్షాత్ పరబ్రహ్మ తస్మై శ్రీ గురవే నమ: అంటే గురువే బ్రహ్మ, విష్ణువు, సాక్షాత్తూ పరబ్రహ్మగా మన కండ్ల ముందు కదలాడే దేవుళ్లుగా మనం భావించాలన్నారు.ఎందుకంటే తల్లిదండ్రుల తర్వాత సమాజంలో గురువుదే అత్యంత ప్రధానమైన స్థానమని అన్నారు. అక్షరాలు దిద్దించే అమ్మే మన గురువనీ, నడక నేర్పి నడత దిద్దే నాన్నే గురువనీ, అమ్మానాన్నల తత్వం కలబోసిన దైవత్వం అవనికి వెలుగులు పంచే ఆచార్యుడు మన గురువంటే అని కీర్తించారు. మనలోని జ్ఞానానికి నిలువెత్తు ఆనవాలు మన గురువులన్నారు. మన భవిష్యత్తును రాసిన చెరిగిపోని సంతకం మన గురువులన్నారు. మనలను ఉన్నతంగా నిలిపిన నిత్య కర్మ శీలురు మన గురువులనీ, మన



రూపం మలిచిన అపురూప శిల్పులు మన గురువులన్నారు. తాను నిచ్చెనగా నిలిచి మనలను శిఖరానికి ఎక్కించిన మానవతా మూర్తులు అన్నారు. విద్యా భాస్కరులు, సామాజిక వైద్యులు, జాతి జ్ఞాన మూలము మన గురువులేని గుర్తుచేశారు. అందుకే గురుదేవుల గురుతర స్థానానికి నా నమస్సుమాంజలి.. మా మనసున నిలిచిన గురువుల కిదే నా హృదయాంజలి.. తల్లిదండ్రులు బిడ్డల బంగారు భవిష్యత్తును గురించి కలలు కంటారు. కానీ ఆ కలలను సాకారం చేయడానికి విద్యాబుద్ధులు నేర్పి, సమాజంలో ఉత్తమ పౌరులుగా తీర్చి దిద్దే గురుతర బాధ్యత మాత్రం గురువులే తీసుకుంటారు. సమాజంలో ఉత్తమ పౌరులుగా, భావిభారత పౌరులుగా తీర్చి దిద్దే అపురూప శిల్పి ఒక్క గురువు మాత్రమే. ఈ రోజు మనందరం ఇలా ఉన్నత స్థానంలో ఉండి సమాజంలో ఉత్తమ వ్యక్తులుగా ఉన్నామంటే అందుకు మనకు చదువుతో పాటు విద్యాబుద్ధులు నేర్పిన మన గురువులే మన ఉన్నతికి కారణం. మన మనసుల్లో వారి స్థానం ఎన్నటికీ ఎవరెస్ట్ శిఖరమంత. వారి రూపం చిరుప్రాయంనుండే నిత్యం మన కండ్లల్లో కదలాడుతూ చెరిగిపోని దృశ్యం. వారు లేనిదే మనం ఇక్కడ ఈ స్థాయిలో లేమని డా. వరికూటి సుబ్బారావు ఘనంగా కీర్తించారు.

**పలువురికి సన్మానం...**

పూర్వ విద్యార్థి సంఘం తరపున పాఠశాలలో పనిచేసి రిటైర్ అయిన ఉపాధ్యాయులు కట్టా భాస్కరాచారి, యండ్రపల్లి పద్మావతి, వాసిరెడ్డి వెంకటేశ్వరరావు, ఎం.విజయలక్ష్మితో పాటు ఇదే పాఠశాలలో చదివి ఉన్నత స్థానాల్లో ఉన్న పబ్బతి వెంకటరవికుమార్, డా.కొప్పిశెట్టి గోవిందరావు, బి.మధుసూదన్‌రావు, డా.వరికూటి సుబ్బారావు, ప్రొ.దుగ్గిరాల రవీంద్ర ప్రసాద్, గరుగుల మురలీకృష్ణ, ఊట్ల శంకర్‌రావు, ఊట్ల రాధాకృష్ణ తదితరులకు ఘనంగా సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థి సంఘం శాశ్వత గౌరవాధ్యక్షులు తెళ్ల గోపాలరావు, అధ్యక్షులు పుతుంబాక శ్రీకృష్ణ ప్రసాద్, కార్యదర్శి మాధవరపు నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు పుల్ల ఖండం చంద్రశేఖరరావు, అవ్వా వెంకటరమణారావు, తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో

# పొంగులేటి పర్యటన



**వనం నాగయ్య, కెరటం న్యూస్**

ఖమ్మం మాజీ పార్లమెంటు సభ్యులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఉమ్మడి ఖమ్మం జిల్లాలో శుక్రవారం పర్యటించనున్నారు. ఈ మేరకు పొంగులేటి క్యాంపు కార్యాలయ ఇన్చార్జీ తుంబూరు దయాకర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పర్యటనలో భాగంగా పాలేరు, ఖమ్మం, కొత్తగూడెం నియోజకవర్గాల్లోని పలు మండలాలను సందర్శిస్తా నన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగే శుభకార్యక్రమాలకు హాజరు కావడంతో పాటు పలు బాధిత కుటుంబాలను పరామర్శిస్తారని తెలిపారు. కావున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని పర్యటనను విజయవంతం చేయాలని దయాకర్ రెడ్డి కోరారు.